క్లుప్తంగా

జగన్‌ను కలిసిన సిరాజ్ బాషా



మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని సత్కరిస్తున్న సిరాజ్‌బాషా

శ్రీకాళహస్తి: మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి శుక్రవారం చెన్నైలోని ఆయన సోదరుడు సునీల్‌రెడ్డి కుమారుడి నిశ్చితార్థ వేడుకలకు హాజరయ్యారు. ఈ సందర్భంగా వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి షేక్ సిరాజ్‌బాషా ఆయన్ని మర్యాదపూర్వకంగా కలిశారు. ముక్కంటి శేషవస్త్రంతో సత్కరించి, ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు బత్తల హరిప్రసాద్, గంగాధరం యాదవ్, ఇలియాజ్ పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండాలి

బుచ్చినాయుడుకండ్రిగ: దోమకాటుతో వ్యాపించే మలేరియా, డెంగీ, చికెన్ గున్యా, మెదడు వాపు, బోధకాలుపై అప్రమత్తంగా ఉండాలని మండల ఆరోగ్య అధికారి వెంకటేశులు తెలిపారు. ఆయన శుక్రవారం గోవిందప్పనాయుడుకండ్రిగ ప్రాథమిక పాఠశాల్లోని విద్యార్థుల కు దోమల నివారణ, దోమలతో వచ్చే వ్యాధులపై, పరిసరాల శుభ్రతపై అవగాహన కల్పించారు.

పరపతి పెంచుకోవాలి



మాట్లాడుతున్న నిరంజన్

నారాయణవనం: రైతులు ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం(పీఏసీఎస్), జిల్లా కేంద్ర సహకార బ్యాంకుల ఆర్థిక చేయూతను సద్వినియోగం చేసుకుని పరపతిని పెంచుకోవాలని పర్సన్ ఇన్‌చార్జి నిరంజన్ పేర్కొన్నారు. స్థానిక సింగిల్ విండో కార్యాలయ ఆవరణలో రైతుల అవగాహన సదస్సు నిర్వహించారు. పుత్తూరు డీసీసీబీ మేనేజర్ సందీప్, సంఘం సీఈఓ బాలసుబ్రమణ్యం, సూపర్‌వైజర్ సాయి శ్రీనివాసులు, విజయ్ పాల్గొన్నారు.

మోటారుకు మరమ్మతు



మోటారు మరమ్మతు చేయిస్తున్న సర్పంచ్

ఏర్పేడు: మండలంలోని ఎండీ పుత్తూరు పంచాయతీ మిట్టఇండ్లులో ఉన్న తాగునీటి మోటారు మరమ్మతు చేయించారు. రెండు రోజుల కిందట తాగునీటి బోరు మోటారు పాడైపోయింది. ఈ విషయం తెలుసుకున్న సర్పంచ్ కందాటి మోహనప్రియ మెకానిక్‌ని పిలిపించి మోటారు పైకి తీయించగా పూర్తిగా కాలిపోయిందని గుర్తించారు. మరమ్మతు చేయించిన మోటారును తిరిగి అమర్చి, మిట్టఇండ్లు ప్రజలకు మంచినీరు అందించారు. పంచాయతీ కార్యదర్శి ఝాన్సీ, ఇంజినీరింగ్ అసిస్టెంట్ యోగేష్ పాల్గొన్నారు.


స్థల పరిశీలన

బుచ్చినాయుడుకండ్రిగ: మండల కేంద్రంలో అంబేడ్కర్ భవన నిర్మాణం కోసం శుక్రవారం తహసీల్దార్ శ్రీదేవి మండల సముదాయంలోని స్థలాన్ని పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం చొరవతో అంబేడ్కర్ భవన నిర్మాణం కోసం ప్రభుత్వం రూ.30 లక్షలు మంజూరు చేసిందన్నారు. భవన నిర్మాణం కోసం స్థలాన్ని పరిశీలించి, కేటాయిస్తామని తెలిపారు. వీఆర్ఓ బాలమురళి, సర్వేయర్ హేమంత్ పాల్గొన్నారు.

గిరి బలిజ జీఓ రద్దు చేయండి

నారాయణవనం: రాష్ట్ర ప్రభుత్వం గిరి బలిజపై విడుదల చేసిన జీఓను వెంటనే రద్దు చేయాలని బలిజ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం రెవెన్యూ కార్యాలయ సిబ్బందికి వినతి పత్రం అందజేశారు. సంఘం నాయకులు గోపీ రాయల్ మాట్లాడుతూ గిరి బలిజల కోసం రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన జీఓ 1793తో రాష్ట్రంలో కాపులకు తీరని ద్రోహం జరుగుతోందని ఆరోపించారు. తక్షణమే జీఓను ఉపసంహరించుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ మేరకు వినతి పత్రాన్ని తహసీల్దార్ కార్యాలయ సిబ్బందికి అందజేశారు. కాపు సంఘం నాయకులు కృష్ణయ్య, మునిబాబు, శ్రీబాలు, నాగరాజు పాల్గొన్నారు.

పూరిల్లు దగ్ధం



తొట్టంబేడు: మండలంలోని తంగేళ్లపాళెంలో శుక్రవారం జరిగిన అగ్నిప్రమాదంలో పూరిల్లు దగ్ధమైంది. బాధితుల కథనం మేరకు.. తంగేళ్లపాళెం ఎస్సీ కాలనీకి చెందిన ఎల్. వెంకటేష్, పోలమ్మ దంపతులు కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఈ క్రమంలో భార్యాభర్తలు యథావిధిగా కూలి పనులకు వెళ్లారు. మధ్యాహ్నం సమయంలో ఇంట్లో నుంచి మంటలు వస్తుండడాన్ని గమనించిన స్థానికులు, పోలయ్యకు, అగ్నిమాపక శాఖ సిబ్బందికి సమాచారం అందజేశారు. దీంతో అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను ఆర్పివేశారు.

తెలుగుతనం.. తీయదనం



బుచ్చినాయుడుకండ్రిగ: కల్లివెట్టులో అ, ఆ అక్షరాకృతిలో విద్యార్థులు

దేశభాషలందు తెలుగులెస్స అని కృష్ణదేవరాయలు కొనియాడినా..ఇటాలియన్ ఈస్టుగా ఘనతకెక్కినా.. అది తెలుగుకే సొంతం అని వక్తలు తెలుగుభాషను వేనోళ్ల కొనియాడారు. శ్రీకాళహస్తి, సత్యవేడు నియోజకవర్గాల్లో శుక్రవారం తెలుగుభాషా దినోత్సవం ఘనంగా జరుపుకున్నారు.

- ఘనంగా తెలుగు భాషా దినోత్సవం



సంప్రదాయ వస్త్రధారణలో విద్యార్థులు

శ్రీకాళహస్తి: పట్టణంలోని ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాలలో శుక్రవారం తెలుగు భాషా దినోత్సవం జరిగింది. ఈ సంద్భంగా తెలుగు ప్రధాన ఆచార్యులు సంక్రాంతి వెంకటయ్య మాట్లాడుతూ గిడుగు రామమూర్తి తెలుగు భాష కోసం ఎనలేని కృషి చేశారని అన్నారు. వైస్ ప్రిన్సిపల్ నరసింహవర్మ మాట్లాడుతూ వివిధ రూపాల్లో ఉన్న తెలుగును గిడుగు రామమూర్తి విడమర్చి చెప్పారన్నారు. అనంతరం విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు.

పాఠశాలల్లో..

శ్రీకాళహస్తి పట్టణం, మండలంలో శుక్రవారం పలు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలో తెలుగు భాషా దినోత్సవం ఘనంగా జరుపుకున్నారు. శ్రీరామ్‌నగర్‌కాలనీలోని శ్రీచైతన్య పాఠశాలలో విద్యార్థులు సంప్రదాయ దుస్తులతో అందరిని అలరించారు. ఉపాధ్యాయులు వర్ణమాలతో కూడిన బొమ్మల కొలువును ఏర్పాటు చేసి వాటి ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించారు. ప్రిన్సిపల్ రూపాదేవి మాట్లాడుతూ తెలుగు భాష తల్లితో సమానమని, దాన్ని ఎవరూ చులకనగా చూడకూడదన్నారు. ఈ కార్యక్రమంలో ఎంజీఎం సురేష్, ఉపాధ్యాయులు, డీన్ తదితరులు పాల్గొన్నారు. ఇక టీడీపీ నాయకులు పట్టణంలోని తెలుగుగంగకాలనీలోని పురపాలకసంఘ పాఠశాలలో తెలుగు భాషా దినోత్సవం నిర్వహించారు. విద్యార్థులకు గ్రంథాలను అందజేశారు. శ్రీకాళహస్తి మండలం ముచ్చివోలులో జరిగిన కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. పట్టణంలోని ఎంజీఎం పాఠశాలలో జరిగిన వేడుకల్లో డైరెక్టర్ గుడ్లూరు మయూర్, ప్రధానోపాధ్యాయులు మునిరత్నంనాయుడు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా తెలుగు భాషా దినోత్సవం

నాగలాపురం: మండలంలోని స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్లస్‌లో శుక్రవారం తెలుగు భాషా దినోత్సవం, జాతీయ క్రీడా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు ఉపాధ్యాయులు, విద్యార్థులు సంప్రదాయ దుస్తులు ధరించి పాఠశాల నుంచి బజారు వీధిలోని గాంధీ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. ప్రధానోపాధ్యాయుడు కస్తూరయ్య మాట్లాడుతూ గిడుగు రామ్మూర్తి పంతులు వ్యవహార భాషకు చేసిన సేవలు, హాకీ క్రీడాకారుడు ధ్యాన్‌చంద్ గురించి విద్యార్థులకు వివరించారు. అనంతరం పాఠశాలలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి, పిల్లలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు గిరిధర్, నాగూరయ్య, సురేంద్ర, విద్యార్థులు పాల్గొన్నారు.

బుచ్చినాయుడుకండ్రిగలో..

బుచ్చినాయుడుకండ్రిగ: తెలుగు భాష ఔన్నత్యాన్ని చాటుదామని అభ్యుదయ రచయితల సంఘం జిల్లా అధ్యక్షుడు యువశ్రీ మురళి అన్నారు. మండలంలోని కల్లివెట్టు, బీఎన్‌కండ్రిగ, నెలవాయి, జెడ్పీ ఉన్నత పాఠశాలలో శుక్రవారం గిడుగు రామ్మూర్తి జయంతిని పురస్కరించుకుని అంతర్జాతీయ తెలుగు భాషా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ కార్యాలయాల్లో అన్ని కార్యక్రమాలు తెలుగులోనే చేపట్టాలన్నారు. గత నాలుగు రోజులుగా నిర్వహించిన భాషా పోటీలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు. తెలుగు తల్లి వేషధారణలు, అ, ఆ అక్షరాకృతి ఆకట్టుకున్నాయి. ప్రధానోపాధ్యాయులు రమణయ్య, వాణి, గాయత్రి, తెలుగు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తెలుగు వారసత్వ సంపద

వరదయ్యపాళెం: తల్లి ఒడి నుంచి నేర్చుకునే భాష తెలుగును భావితరాలకు అందించాల్సిన బాధ్యత అందరిపై ఉందని వరదయ్యపాళెం హైస్కూల్ ఇన్‌చార్జ్ హెచ్‌ఎం సరస్వతి అన్నారు. గిడుగు రామ్మూర్తి పంతులు జయంతి సందర్భంగా తెలుగుభాషా దినోత్సవాన్ని పలు పాఠశాలల్లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వరదయ్యపాళెం పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థులు తెలుగుతల్లి వేషధారణతో ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో తెలుగు రచయిత పళ్లిపట్టు నాగరాజు మాట్లాడుతూ.. తెలుగు భాష మన వారసత్వ సంపదని, ఆ భాషా సంపదను రక్షించుకుంటూ భవిష్యత్‌కు అందించాలన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయుడు శివారెడ్డి, రమేష్, నాగమల్లి, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బత్తలవల్లం, కారిపాకం, గోవర్ధనపురం హైస్కూళ్లలో తెలుగు భాషా దినోత్సవాన్ని ప్రధానోపాధ్యాయిని జయసుధ, రవీంద్రరెడ్డి అధ్యక్షతన ఘనంగా నిర్వహించి, విద్యార్థులకు బహుమతులు అందజేశారు.



ముచ్చివోలులో తెలుగు భాష దినోత్సవం



బత్తలవల్లంలో విద్యార్థినికి బహుమతి ప్రదానం



ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

నారాయణవనం: మాతృభాషపై బాల్యం నుంచే శ్రద్ధ పెట్టి, మమకారాన్ని పెంచుకోవాలని స్థానిక బాలికల ఉన్నత పాఠశాల ప్లస్ ప్రధానోపాధ్యాయులు మనోహరి పేర్కొన్నారు. శుక్రవారం పాఠశాలలో గిడుగు రామ్మూర్తి, మేజర్ ధ్యాన్‌చంద్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ప్రార్థనా మందిరంలో రామ్మూర్తి, ధ్యాన్‌చంద్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రపంచీకరణ ముసుగులో మాతృభాష నిర్లక్ష్యానికి గురవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బాలికలు నిర్వహించే తెలుగుదనం ఉట్టిపడే సాంస్కృతిక కార్యక్రమాలను, వస్త్రధారణ ప్రదర్శన అందరినీ ఆకట్టుకుంది.





బుచ్చినాయుడుకండ్రిగలో గిడుగు రామ్మూర్తి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు, వరదయ్యపాళెం: వివిధ వేషధారణల్లో విద్యార్థులు



రామ్మూర్తి, ధ్యాన్‌చంద్‌లకు నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు

హక్కులపై అవగాహన పెంచుకోవాలి



మాట్లాడుతున్న న్యాయమూర్తి బేబీరాణి

శ్రీకాళహస్తి: రాజ్యాంగం మహిళలకు కల్పించిన హక్కులపై అవగాహన పెంచుకుని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని సీనియర్ సివిల్ జడ్జి బేబీ రాణి సూచించారు. శ్రీకాళహస్తి ప్రభుత్వ మహిళా జూనియర్ కళాశాలలో శుక్రవారం న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో ఆమె పాల్గొని మాట్లాడారు. నేటి సమాజంలో విద్యార్థినులు ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ కేసులు, బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహన పెంచుకోవాలన్నారు. రాజ్యాంగం ద్వారా ప్రతి పౌరుడికి వివిధ రకాల హక్కులు లభించాయని, ఇదే క్రమంలో మహిళలకు సమాన హక్కులు ఉన్నాయన్నారు. ప్రతి ఒక్కరూ హక్కుల సద్వినియోగంపై అవగాహన పెంచుకున్నప్పుడే న్యాయం పొందగలుగుతారన్నారు. న్యాయస్థానం అందరికీ అందుబాటులో ఉండి సమాన హక్కులు కల్పిస్తుందని భావించాలన్నారు. మహిళలకు ఎక్కడైనా ఇబ్బందులు ఎదురైనా, ఇతర సమస్యలున్నా న్యాయస్థానాన్ని ఆశ్రయించి, తమను తాము కాపాడుకునే హక్కులు ఉన్నాయని చెప్పారు.

అధికారులు పనితీరు మార్చుకోవాలి

బుచ్చినాయుడుకండ్రిగ: గ్రామరెవెన్యూ అధికారులు, గ్రామ సచివాలయ సర్వేయర్ల పనితీరు బాగోలేదని, వారు పనితీరు మార్చుకోక పోతే చర్యలు తప్పవని తహసీల్దార్ శ్రీదేవి హెచ్చరించారు. ఆమె శుక్రవారం రెవెన్యూ కార్యాలయంలో వీఆర్‌ఓలు, సర్వేయర్లు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రీవెన్స్ డే రోజున నిర్వహించే ప్రజా సమస్యల ప్రజావేదిక కార్యక్రమంలో వచ్చిన వినతులను విచారించి పరిష్కరించాలన్నారు. భూ సమస్యలపై ప్రత్యేక శ్రద్ధ చూపించాలని, దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉండే సమస్యలను తన దృష్టికి తీసుకురావాలన్నారు.



మాట్లాడుతున్న తహసీల్దార్ శ్రీదేవి

ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని తెలిపారు. భూసమస్యల పరిష్కారంలో అలసత్వం ప్రదర్శిస్తే ఊరుకోమని తెలిపారు.

ముక్కంటి సేవలో ప్రముఖులు

శ్రీకాళహస్తి: జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామివారిని శుక్రవారం పలువురు ప్రముఖులు వేర్వేరు సమయాల్లో దర్శించుకున్నారు. రాజస్థాన్ హైకోర్టు న్యాయమూర్తి మున్నూరి లక్ష్మణ్, కేరళ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఈశ్వరన్ వేర్వేరుగా దర్శించుకున్నారు. దక్షిణ గోపురం వద్ద ఆలయాధికారులు వారికి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం వేదపండితులు వారిని ఆశీర్వదించి స్వామి అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థ ప్రసాదాలు అందజేశారు.



ఆలయం వద్ద జస్టిస్ మున్నూరి లక్ష్మణ్

నిత్యాన్నదాన పథకానికి రూ.50 వేల విరాళం



విరాళం అందజేస్తున్న దాతలు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి తిరుపతికి చెందిన సుబ్రహ్మణ్యం, జయలక్ష్మమ్మ శుక్రవారం రూ.50 వేలు విరాళంగా అందజేశారు. ఆలయాధికారులు విరాళం స్వీకరించి, దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. వారికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం వారిని వేదపండితులు ఆశీర్వదించి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

రైతు సేవా కేంద్ర సిబ్బందికి శిక్షణ



సమావేశంలో మాట్లాడుతున్న శాస్త్రవేత్తలు

శ్రీకాహస్తి: జిల్లా వనరుల కేంద్రం తిరుపతి వారి సౌజన్యంతో శ్రీకాళహస్తి డివిజన్ వ్యవసాయ సహాయ సంచాలకులు ఆధ్వర్యంలో రైతు సేవా కేంద్ర సిబ్బందికి డివిజనల్ స్థాయి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాస్ కేవీకే విస్తరణ శాస్త్రవేత్త శ్రీరామ్‌కుమార్ మాట్లాడుతూ రైతులు రైతు ఉత్పత్తి సహకార కేంద్రాలను ఏర్పాటు చేసుకోవడంతో సాగులో ఖర్చు తగ్గించుకోవడమే కాక అధిక దిగుబడులు, లాభాలను సాధించవచ్చని తెలిపారు. జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయ అధికారి వేణుగోపాల్ మాట్లాడుతూ సమీకృత వ్యవసాయ పద్ధతులు పాటిస్తే రైతుల కు ఖర్చు తగ్గడమే కాక ఆదాయం పెరగడంతో పాటు పర్యావరణానికి హితం చేకూరుతుందన్నారు. శ్రీకాళహస్తి డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకులు రమేష్, జిల్లా వనరుల కేంద్రం ఏఈఓ రవి ప్రసాద్ పాల్గొన్నారు.

స్మార్ట్ రేషన్ కార్డుల కోసం పడిగాపులు

నాగలాపురం: ఇంటింటికి స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేస్తామన్న అధికారుల ప్రకటన నీటి మూటగా మారింది. మండలంలోని పంచాయతీ కార్యాలయం వద్ద ఉన్న సచివాలయంలో శుక్రవారం స్మార్ట్ రేషన్ కార్డులను ఇస్తామని లబ్ధిదారులకు సమాచారం అందించారు. దీంతో వారంతా సచివాలయాలకు పరుగులు తీశారు. ఇంట్లో పనులు మానుకొని గంటల తరబడి మహిళలు, వృద్ధులు సచివాలయం వద్ద అవస్థలు పడ్డారు. సర్వర్ బిజీ, ఓటీపీ రావడం లేదని మూడు రోజులుగా సచివాలయాల చుట్టూ తిరుగుతున్నామని వాపోతున్నారు. పాత రేషన్ కార్డు ఇస్తేనే కొత్త రేషన్ కార్డు అని తిరిగి పంపించేస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి, చర్యలు తీసుకోవాలని లబ్ధిదారులు కోరుతున్నారు.



స్మార్ట్ రేషన్ కార్డుల కోసం పడిగాపులు కాస్తున్న మహిళలు, వృద్ధులు

పోరాటాలే కాదు.. సేవల్లో సీపీఐ భేష్

శ్రీకాళహస్తి: ప్రజా సమస్యలపై పోరాటాలే కాదు.. సేవా కార్యక్రమాల్లో ముందు ఉండడం సంతోషకరమని శ్రీకాళహస్తి డీఎస్పీ నరసింహమూర్తి అన్నారు. వినాయక చవితి సందర్భంగా శ్రీకాళహస్తి పట్టణంలోని 18వ వార్డు ఈశ్వరయ్య గిరిజన కాలనీలో స్థానిక డీఎస్పీ నరసింహమూర్తి చేతుల మీదుగా సీపీఐ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ సీపీఐ ప్రజా సమస్యలు, పోరాటాలే కాకుండా సామాజిక కార్యక్రమాలు చేయడం చాలా సంతోషం అన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ కార్యదర్శి జనుమాల గురవయ్య, పట్టణ కార్యదర్శి రోడ్డ గోపి, రెడ్డి వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు మహేంద్రరెడ్డి, ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్షులు చారులత, శాఖ కార్యదర్శి మునెమ్మ, గంగమ్మ, పార్టీ పట్టణ నాయకులు మణికంఠ, మునిరాజా, మధు పాల్గొన్నారు.



అన్నదానం చేస్తున్న డీఎస్పీ నరసింహమూర్తి

రేషన్ డీలర్‌ను తొలగించాలని ఫిర్యాదు

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని తహానగర్ గ్రామంలోని రేషన్‌షాపు డీలర్‌ను తొలగించాలని శుక్రవారం గ్రామస్తులు తహసీల్దార్ శ్రీదేవికి వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రేషన్ షాపు డీలర్ మునికృష్ణయ్య సక్రమంగా సరుకులను పంపిణీ చేయడం లేదని తెలిపారు. రేషన్‌షాపులోని సరుకులను బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తున్నాడని ఆరోపించారు. సమయపాలన పాటించకుండా ఆయన ఇష్టానుసారం సరుకులను పంపిణీ చేస్తున్నాడని, అడిగితే గొడవకు వస్తున్నాడని తెలిపారు. డీలర్‌ను విధుల నుండి తొలగించాలని డిమాండ్ చేశారు. దీనిపై స్పందించిన తహసీల్దార్ శ్రీదేవి మాట్లాడుతూ విచారించి చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు.



వినతి పత్రం ఇస్తున్న గ్రామస్తులు

గంగ ఒడికి గణపయ్య



బుగ్గవీధిలోని వినాయకుడి ఊరేగింపు



ప్రధాన వీధిలో ఊరేగుతున్న గణనాథుడు

- ఘనంగా నిమజ్జనాలు

మూడు రోజుల పాటు ఘనంగా పూజలందుకున్న గణపయ్య.. శుక్రవారం గంగ ఒడికి చేరుకున్నాడు. రేణిగుంట పట్టణంలోని పలు కూడళ్లలో కొలువుదీర్చిన వినాయక విగ్రహాల నిమజ్జన వేడుకలు కోలాహలంగా సాగాయి. పెద్ద ఎత్తున శోభాయాత్రలు, సాంస్కృతిక ప్రదర్శనల నడుమ వినాయక విగ్రహాలను నిమజ్జనం చేశారు.

రేణిగుంట: మండలంలోని పలు గ్రామాల్లో కొలువుదీర్చిన వినాయక విగ్రహాలను మూడో రోజైన శుక్రవారం నిమజ్జనం చేశారు. రేణిగుంట రైల్వేస్టేషన్ ఎదురుగా ఏర్పాటు చేసిన గణనాథుడి విగ్రహం, బుగ్గ వీధిలోని విఘ్నేశ్వరుడి విగ్రహాన్ని ప్రధాన వీధుల్లో ఊరేగించి, చక్రాలగుంటలో నిమజ్జనం నిర్వహించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా డీఎస్పీ శ్రీనివాసరావు, సీఐ జయచంద్ర తమ సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు. బుగ్గవీధి లో వినాయక నిమజ్జన కమిటీ ఆధ్వర్యంలో మధ్యాహ్నం అన్నదానం చేశారు. డీఎస్పీ శ్రీనివాసరావు గణనాథుడిని దర్శించుకుని అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు.





నవ దంపతుల చేతుల మీదుగా కల్యాణోత్సవం జరిపిస్తున్న అర్చకులు, భక్తులకు భోజనం వడ్డిస్తున్న డీఎస్పీ

కనుల పండువగా కల్యాణం

రేణిగుంట మండలంలోని కురక్రాలవలోని అభయ వరసిద్ధి వినాయక ఆలయంలో జరుగుతున్న వినాయక చవితి వేడుకల్లో భాగంగా శుక్రవారం సిద్ధి, బుద్ధి గణపతి వివాహ మహోత్సవం ఆద్యంతం వైభవంగా నిర్వహించారు. మునిరామయ్య సిద్ధి, బుద్ధి అమ్మవార్లకు వెండి కవచాలను వితరణ చేశారు. దాత ప్రేమ్ వినాయకస్వామివారికి జంజం బహూకరించారు. ఆలయ సంప్రదాయం ప్రకారం ఈ ఏడాది నూతనంగా వివాహం చేసుకున్న వధూవరులు ఉభయకర్తలుగా వ్యవహరించగా అర్చకులు గంటి శ్రీనివాసశర్మ, మణికంఠ శర్మ వినాయకస్వామివారి కల్యాణోత్సవం శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు వి మురగయ్య విందు భోజనం ఏర్పాటు చేశారు. మాజీ సర్పంచ్ రాణమ్మ, ఎంపీటీసీ సభ్యుడు భాస్కరయ్య, బీజేపీ నాయకులు వేణు ముదిరాజ్, కిరణ్, అయ్యప్ప, కుమార్, మోహన్, భాస్కర్, రాఘవాచారి, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

గణేష్ లడ్డూ ధర రూ.1.05 లక్షలు

ఏర్పేడు: మండల కేంద్రంలోని బజారు వీధిలో కొలువుదీర్చిన వినాయకుడికి నైవేద్యంగా పెట్టిన లడ్డూను శుక్రవారం వేలం వేయగా స్థానిక జ్యోతి బుక్స్ ఫ్యాన్సీ షాపు యజమాని ఊటి చంద్రశేఖర్‌యాదవ్ రూ.1.05లక్షలకు వేలంపాటలో దక్కించుకున్నారు. గ్రామ సర్పంచ్ నల్లపాళెం శివయ్య ఆయనకు వినాయకుని లడ్డూను అందజేశారు. అనంతరం స్వామివారి భారీ విగ్రహాన్ని ఊరేగించి, నిమజ్జనం చేశారు.

అన్నదానం



ఏర్పేడు: మండలంలోని ఆదర్శ నిలయంలోని వృద్ధులు, వికలాంగులకు పులిచెర్ల మండలం దిన్నుపాటివారిపల్లికి చెందిన గుండ్లపల్లి తాతమ్మ కుటుంబ సభ్యులు శుక్రవారం అన్నదానం చేశారు. తాతమ్మ రెండో వర్ధంతి సందర్భంగా చేసిన ఈ కార్యక్రమంలోఆషా స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు జూలియస్ రాజు పాల్గొని, కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ట్రస్ట్ వ్యవస్థాపకరాలు సైదమ్మ మాట్లాడుతూ వృద్ధులు, వికలాంగులు సుమారు 50 మంది తమ ఆశ్రమంలో ఆశ్రయం పొందుతున్నారన్నారు. దాతలు ఎవరైనా ముందుకొచ్చి మీకు తోచిన విధంగా సహాయం చేయవచ్చని కోరారు. కార్యక్రమంలో ప్రభాకర్,హరి బాబు, చంద్రిక,తేజోవతి, ప్రజ్ఞ, గోవర్ధన్, దాము, ఏకాంబరం, రుకేష్ పాల్గొన్నారు.